# వెన్నెల

— డి. ఆర్. ఇంద్ర

తలుపుమీద దబదబ చప్పుడు రాత్రి రెండుగంటలకి!

ముఖంమీద అద్దం బద్దలైనట్టయి మెలుకువ వచ్చేసింది. నన్ను తీగలా అల్లుకుపోయిన మాలతికి నిద్రాభంగం కాకుండా మెల్లిగా విడివడి లేచాను. కానీ తలుపుమీద ఆగకుండా చప్పుడవడంతో మాలతి కూడా కంగారుగా లేచింది.

లైటువేసి తలుపు తీశాను.

ఎదురుగా నారాయణరావు — అసహనంగా, రౌద్రంగా!

పక్కనే కూతురు వెన్నెల!

నారాయణ కూతురు చెయ్యిపట్టుకుని విసురుగా లోపలికొచ్చాడు. మాలతి ఆశ్చర్యపోతూ వచ్చి నా పక్కన నిలబడింది. వేగంగా రావడంవల్ల కలిగిన ఆయాసంతో నారాయణ రొప్పుతున్నాడు.

"ఏం జరిగింది!?" అన్నానో — అన్నానని అనుకున్నానో!

నారాయణ కూతుర్ని ఒక్కసారి విసురుగా మా ముందుకి గెంటాడు.

"ఈ ముదనష్టపుదానికి కడుపు! ఇదంతా మీ దంపతుల చలవే! ఆడపిల్లని స్వేచ్ఛగా ఎదగనివ్వాలంటూ, స్వేచ్ఛగా చదువుకోనివ్వాలంటూ మొదటినుండీ దాన్ని వెనకేసుకొచ్చావ్. నువ్వు బాల్యస్నేహితుడివనీ, బాగా చదువుకున్న మేధావివనీ, నా కుటుంబానికి ఆత్మీయుడవనీ నమ్మి, మాకిష్టం లేకపోయినా నీ మాట మీద యూనివర్శిటీకి పంపితే ఇది చేసిన నిర్వాకం ఇదీ! కడుపు తీయించుకోదట! అలాగని ఆ కడుపుచేసిన బ్రాష్టుడ్ని పెళ్ళీ చేసుకోదట! నీ అండ చూసుకునే ఇది నా కొంప కొల్లేరు చేసింది. ఇంక ఇది నా కూతురూ కాదు — నువ్వు నా స్నేహితుడివీ కాదు. ఎలా ఛస్తారో చావండి!"

ఎంత వేగంగా రొప్పుతూ వచ్చాడో అంత వేగంగా కూతుర్ని వదిలి వెళ్ళిపోయాడు టార్గెట్ మీద బాంబింగ్‌వేసి వెనుదిరిగిన యుద్ధవిమానంలా!

పిడుగుపడ్డాకా చెట్టుకాలి చిటపటమండుతున్నట్టుంది.

వెన్నెల మాకేసి చాలా మామూలుగా చూసింది ఏమీ జరగనట్టు. ఆ ఇబ్బందికర పరిస్థితిలోంచి మొదట మాలతే తేరుకుంది. వెన్నెలని కూర్చోమంది. వెన్నెల కూర్చున్నాకా తను కిచెన్లోకి వెళ్ళింది టీ పెట్టడానికి. వెన్నెలకి మాలతి కాచే యాలక్కాయ టీ అంటే చాలా ఇష్టం. నాక్కూడా.

వెన్నెల ఏమైనా మాట్లాడుతుందని చూశాను. టీపాయ్ మీదున్న ఫెమీనా పత్రిక తీసి తిరగెయ్యసాగింది చాలా కాజువల్‌గా వచ్చి కూర్చున్నప్పుడు చేసినట్టే.

మాలతి టీకప్పులు తెచ్చిచ్చి వెన్నెలకెదురుగా కూర్చుంది. వెన్నెల టీ తాగుతూనే పత్రిక తిరగేస్తోంది. నా ఖాళీకప్పు సింక్‌లో కడిగేసి బయటకొచ్చి డాబా ఎక్కాను. చలిగాలి ఈడ్చికొడుతోంది. వెన్నెల విరగకాస్తోంది. ప్రాణికోటి లేని గ్రహంలాగ అంతటా నిశ్శబ్దంగా వుంది.

నారాయణ పేల్చిన బాంబు విస్ఫోటనంతో ముక్కచెక్కలైన మెదడు ముక్కల్ని ఏరుకుని యధాస్థితిలో చేర్చే వ్యర్థప్రయత్నం చేస్తున్నాను.

బాంబు పేల్చింది నారాయణా? లేక వెన్నెలా?

నారాయణతో నా అనుబంధం ఈనాటిదికాదు. ఏడవతరగతి నుండి కల్సి చదువుకున్నాం. వాడు చదువుపై పెద్దగా అభిరుచిలేక స్కూల్ ఫైనలయ్యాకా రెవెన్యూలో గుమస్తాగా చేరాడు. నేనెక్కువ చదువుకుని కూడా నా ప్రవృత్తిరీత్యా మొక్కలన్నా పిల్లలన్నా ఇష్టపడడంతో బడిపంతుల్ని అయ్యాను. నారాయణ సాంప్రదాయ జీవితంపై గౌరవం, అభిరుచీ వున్నవాడు. సాంప్రదాయాలంటే నేను బొత్తిగా గౌరవం లేనివాడ్ని. ఐనా ఆ భేదాలు మా స్నేహానికి అడ్డురాలేదు. నారాయణకి నా తెలివితేటలపై, నా మాటపై గౌరవం, నమ్మకం వున్నాయి.

వెన్నెల చిన్నపిల్లకాదు. ఇరవైనాలుగేళ్ళ యువతి.

వెన్నెల సాదాసీదా ఆడపిల్లకాదు. ఎమ్మే తెలుగు సాహిత్యంలో యూనివర్శిటీ ఫస్ట్ వచ్చిన విద్యార్థిని. రీసెర్చి డిగ్రీకోసం—'సమాజంపై స్త్రీవాద సాహిత్య ప్రభావ పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేస్తున్న స్కాలర్.

వెన్నెల నా గుండెలపై గంతులేసి ఆడుకున్న పిల్ల.

ఇద్దరు పోతురాయుళ్ళు తప్ప ఆడపిల్ల లేని మా ఇంట కూతురుకన్నా ఎక్కువ స్థానమే పొందిన పిల్ల వెన్నెల.

వెన్నెలకి ఆ పేరు పెట్టింది కూడా నేనే.

తన తల్లి మాణిక్యాంబ పేరుమీద మణి అని పేరుపెడతానంటే నారాయణని వారించి, నిండువెన్నెల రాత్రి పుట్టింది కాబట్టి వెన్నెల అని పెట్టమని సూచించింది నేనే. కాళ్ళకి వెండిగజ్జెలపట్టీలుకొనీ, గౌన్లుకొనీ, దగ్గరుండి స్కూల్లో చేర్పించిందీ నేనే. పిల్లకి గారం నేర్పి చెడగొడుతున్నానని నారాయణచేత చివాట్లు తిన్నదీ నేనే.

ఇంటర్ తర్వాత వెన్నెల పెళ్ళి చేసేస్తానన్నాడు నారాయణ. మంచిమార్కులతో ఇంటర్ పాసైన వెన్నెల నా దగ్గరకొచ్చి ఏడ్చింది. నారాయణని కేకలేసి వెన్నెలని డిగ్రీలో చేర్పించాను. డిగ్రీలో కూడా కాలేజీ ఫస్ట్ వచ్చింది. ఎమ్మేలో చేరతానంది. వీల్లేదు చదివింది చాలన్నాడు నారాయణ. మళ్ళీ మధ్యవర్తినయ్యాను. ఊళ్ళోనే పి.జి. సెంటరుంది. ఎక్కువ ఖర్చుకాదు, ఖర్చయితే నేను భరిస్తానన్నాను.

నారాయణ కోపంతో బాగా విసుక్కున్నా, నా మాట కాదనలేకపోయాడు. వెన్నెల ఎమ్మేలో యూనివర్శిటీ ఫస్ట్ వచ్చినందుకు నారాయణకన్నా నేనూ, మాలతే ఎక్కువ సంతోషించాం. ఎం.ఫిల్. చేస్తానంది వెన్నెల. చదువు అందరికీ రాదు. చదువుకోవాలని వున్నంతవరకూ చదువుకోనీ, ఆడపిల్లల చదువుమీద నిర్బంధాలు విధించడం మంచిదికాదన్నాను. నారాయణ కోపం తారస్థాయినందుకుంది. నన్నెడాపెడా దులిపేశాడు. నీకాడపిల్లలు లేరు కాబట్టి ఆడపిల్ల తండ్రి ఫీలయ్యే 'పీకమీదికత్తి', 'నెత్తిమీది బరువు' నీకర్థంకాదుకాబట్టి నోరుమూసుకోమన్నాడు. వెన్నెలకి చక్కని గుమస్తా పెళ్ళికొడుకుని రెడీచేశాననీ, ఇష్టమైతే వచ్చి అక్షింతలు వేసి వెళ్ళమన్నాడు.

వెన్నెల ప్రస్తుతం పెళ్ళి సంగతి ఎత్తవద్దనీ, ఎం.ఫిల్. అయ్యాకా ఆలోచిద్దామంది. 'ఆలోచనా—ఆడముండల్తోనా' అన్న అగ్నిహోత్రావధాన్లలాగ ఎగిరిపడ్డాడు నారాయణ. నోరుమూసుకుని తెచ్చిన సంబంధం చేసుకొని సలక్షణంగా అత్తింటికి పొమ్మన్నాడు. వెన్నెలకూడా తిరగబడింది. అసలు పెళ్ళే చేసుకోను పొమ్మంది. కాదంటే ఇంట్లోంచి ఎక్కడికైనా పోతానంది. నారాయణ భార్య నెత్తీనోరూ బాదుకుంది. ఇదంతా వెన్నెలకి నేను నేర్పిపెట్టిన స్వేచ్ఛాభావాల ఫలితమేననీ, తన కూతురి జీవితాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాననీ ముక్కుచీదింది.

"పోనీ వెన్నెలని మాకిచ్చెయ్యండి. చాలనేదాకా చదువుచెప్పించి, కావాలన్నపుడే పెళ్ళిచేస్తాం మా ఖర్చుమీద" అన్నాం మాలతీ, నేనూ. నారాయణ దంపతులు మావంక చాలా గుర్రుగా చూశారు.

చివరికి తండ్రీ కూతుళ్ళకి నేనే ఓ ప్రపోజల్ చేశాను. దానిప్రకారం వెన్నెల ఎం.ఫిల్. చేయడానికి నారాయణ ఒప్పుకోవాలి. ఎం.ఫిల్. అయిన వెంటనే వెన్నెల తండ్రి చెప్పినట్టు విని పెళ్ళి చేసుకోవాలి. దీనికి వెన్నెల ఒప్పుకుంది. నారాయణ మాత్రం వీల్లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. రెండురోజులు నేనూ, మాలతీ బతిమాలగా బతిమాలగా కోపంగానే 'మీ ఇష్టం వచ్చినట్టేడవండి' అన్నాడు.

వెన్నెల వాల్తేరు వెళ్ళి యూనివర్శిటీలో చేరింది. వెన్నెల పరిశోధనాంశంగా తీసుకున్న అంశంపై కూడా నారాయణ నన్ను, వెన్నెలనీ వెటకరించాడు. ఆ అంశం కూడా నేనే సెలెక్ట్‌చేసిపెట్టానని నిందించాడు. శుభ్రంగా ఏ విశ్వనాథవారి రామాయణకల్పవృక్షం గురించో తీసుకోక స్త్రీవాద సాహిత్య ప్రభావం కన్నా ఛెండాలపు అంశం ఇంకేమీ దొరకలేదా అన్నాడు.

"నా ప్రమేయం ఏమీ లేదు. తనే ఎంచుకుంది" అన్నాను.

"అదే, ఆడపిల్ల తనకిష్టమైనవి ఎంచుకునే అవకాశాన్నివ్వడమే వినాశనం తెస్తుంది" అన్నాడు.

వెన్నెల కొన్నాళ్ళు అడపాదడపా మాకు ఉత్తరాలు రాసేది. తర్వాత తగ్గించేసింది. వెన్నెల రాయకపోయినా నేను మాత్రం వెన్నెల గురించి విశేషాలు కనుక్కుంటూండేవాడ్ని.

వెన్నెల ఎమ్మేలో వుండగానే కథలు రాయడం మొదలుపెట్టింది. ఇపుడు బాగా ఉధృతం చేసింది. వెన్నెలకి భాషపై పట్టుంది. చక్కని శైలి వుంది. రాసేవన్నీ స్త్రీవాదకథలే. ప్రతి కథలో పురుషాధిక్యతపై కసి, అసహ్యం కొట్టొచ్చినట్టు కనపడేవి. వివాహం ఆడదాని మెడకో గుదిబండ అని తేల్చేది. ఆ గుదిబండని తప్పించుకోవాలంటే చదువుకుని సంపాదించుకుంటూ స్వేచ్ఛగా బతకడమే పరిష్కారం అని తేల్చేది. వివాహ— కుటుంబ వ్యవస్థలపై నిప్పులు చెరిగేది. కొద్దికాలంలోనే ఆంధ్రదేశంలో వెన్నెల నెంబర్‌వన్ స్త్రీవాద రచయిత్రి అయిపోయింది. వెన్నెల కథలకి అన్ని పత్రికలూ పట్టం కట్టాయి. వెన్నెల కథల్ని మాలతీ, నేనూ తప్పక చదివేవాళ్ళం. నారాయణ భార్య మాత్రం పిచ్చికథలు అంటూ పత్రికని చింపిపోసేది.

ఒక వెన్నెలరాత్రి బీచ్‌లో వెన్నెల మగ విద్యార్థులతో కలిసి విహరించడం చూసినట్టు నారాయణకి ఎవరో చుట్టం చెప్తే, నారాయణ నాపై మండిపడ్డాడు — కేర్‌టేకర్ బాధ్యత తీసుకున్న నువ్వేం చేస్తున్నావంటూ.

వెన్నెల్లో వస్తూన్న మార్పు నాకు స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఎం.ఫిల్. అయ్యాకా వెన్నెల తండ్రికిచ్చిన మాట ప్రకారం ఇంటికొచ్చి పెళ్ళి చేసుకుంటుందా అనే అనుమానం నాలో పుట్టి పెరుగుతూనే వుంది. నా అనుమానం నిజమైంది.

ఈ పరిస్థితికి కారణం ఎవరిని అని నేను నిందించాలో నాకర్థం కాలేదు.

నెల్లాళ్ళ క్రితం ఒక ప్రముఖ టి.వి. ఛానెల్లో వచ్చిన ఒక కార్యక్రమం గుర్తుకొచ్చింది. "మారుతూన్న స్త్రీ' అనే అంశంపై కొంతమంది విద్యాధికులైన యువతీయువకులతో నిర్వహించిన చర్చాగోష్ఠి అది.

చర్చ చాలా వాడిగా వేడిగా జరిగింది.

సూపర్ కంప్యూటర్ల యుగంలో కూడా మార్పు చెందకుండానే కొనసాగుతూన్న పురుషాధిక్య సమాజం మీద యువతులు నిప్పులు చెరిగారు. స్త్రీ కట్టుబానిసత్వానికి వివాహమూ, కుటుంబమూ కారణం కాబట్టి వివాహవ్యవస్థే ఉండకూడదన్నారు కొంతమంది ఆడపిల్లలు.

"అలాగా! మరి పెళ్ళీ పెటాకులూ లేకుండా, ఏంచేస్తారట ఆడపిల్లలు!?" అని వెటకరించారు యువకులు.

"హద్దూ, అదుపూ లేకుండా మీరు స్వేచ్ఛగా బతుకుతూన్నట్టే మేమూ స్వేచ్ఛగా హాయిగా బతుకుతాం" కోరస్‌గా జవాబిచ్చారు ఆడపిల్లలు.

"ఓ.కె. మీరూ మా మగాళ్ళలాగే చదువుకుంటారు, సంపాదిస్తారు, సొంతిల్లు కొనుక్కుంటారు, బ్రహ్మచారిణిల్లా స్వేచ్ఛగా బతుకుతారు. అంతేనా జీవితం? తిండి, సౌకర్యాలు ఒక్కటే చాలా? మా మగతోడు, సెక్సూ, పిల్లలూ అవసరం లేదా?" యువకులు నిలదీశారు. ఆ టాపిక్ వచ్చేసరికి కొంతమంది ఆడపిల్లలు సిగ్గుతో వెనక్కి తగ్గినా మరికొంతమంది ఆడపిల్లల ముఖాలు కోపంతో ఎర్రబడ్డాయి. వాళ్ళూరుకోలేదు. రోషంతో రెచ్చిపోయారు.

"ఏం, ఆడతోడు, సెక్స్, పిల్లలు మీకు అవసరం లేదా? మీకు అవసరంలేదనుకుంటే మీ అవసరం మాకూ లేదు. ఆడవాళ్ళు మాత్రమే మొగుడు, పిల్లలు, సంసారం కావాలంటారని మీరనుకోవడం మీ మూర్ఖత్వం. సెక్సువల్ ఇనిస్టింక్ట్‌ని మీరూ కాదనలేరు, మేము కాదనలేం దటీజ్ ది నేచురల్ అర్జ్" అన్నారు ఆడపిల్లలు.

"వివాహాన్ని నిరాకరించే మీరు మగతోడు, నేచురల్ సెక్సు మాత్రం అవసరమే అనడం ఎంత అసమంజసంగా వుందో ఆలోచించారా?" ఓ గడుగ్గాయి నిలేశాడు.

"మేం నిరాకరించేది మనుష్యుల్ని వంటింటి కుందేళ్ళనీ, పడగ్గది మరబొమ్మల్నిగానూ మార్చే పెళ్ళి అనే ఉరితాటిని మాత్రమే. మేం కోరేది మాపై ఏ పెత్తనానికీ అవకాశంలేని సహజీవనం. తోడుండే వ్యక్తి నచ్చనపుడు తక్షణమే విడిపోయి, బాదరబందీ లేకుండా స్వేచ్ఛగా వుండగలిగే జీవితాన్ని మేం కోరేది తెల్సిందా?" జవాబిచ్చింది ఓ గడుగ్గాయిపిల్ల. ఆ కుర్రాడూ వూరుకోలేదు.

"అంటే మీ ఆడపిల్లలు ఆర్థిక స్వేచ్ఛతోబాటు లైంగిక స్వేచ్ఛకూడా కావాలంటారు. అంతేనా? పెళ్ళి అనేది లేకుండానే నచ్చినవాడితో కలిసి వుంటారు. నచ్చని క్షణం విడిపోతారు. మళ్ళీ మరొకడితో ... మళ్ళీ విడిపోవడం ... మళ్ళీ మరొకడు! ఇలా చేతిరుమాళ్ళను మార్చినట్టు 'తోడు'ని మార్చుకుంటూ భార్య—భర్త—పిల్లలు— కుటుంబం అనే స్థిరజీవనం లేకుండా అస్థిర, అస్థిమిత జీవనాన్ని జీవించడమే మీ స్వేచ్ఛా ప్రయోజనం అన్నమాట! సైన్స్ లేబరేటరీలో ప్రయోగాలు చెయ్యడంలాటిదే జీవితంలో ప్రయోగాలు చెయ్యడం కూడా అనుకుంటున్నారా? లేబరేటరీలో ప్రయోగం బెడిసికొడితే నష్టపోయేది కాసిని గాజుకుప్పెలు, రసాయనాలు. మహాఅయితే ఏ ఆసిడ్‌చుక్కో మీదపడితే ఏ కాలో చెయ్యో కాస్త కాలుతుంది. జీవితాన్నే ఒక ప్రయోగశాలగా చేస్తే జీవితం కుక్కలుచింపిన విస్తరికాదూ? దీన్ని స్వేచ్ఛ అంటారా? బతుకుల్ని కాల్చుకోవడం అంటారా? సామాజిక జీవితానికి ప్రాతిపదిక అయిన కుటుంబం అనేది లేకుండా బతికే అస్థిరపు వంటరి బతుకుల్లో జీవితానందం అనేది ఎడారిలో ఎండమావి కాదూ?


గర్భం దాల్చడం, పిల్లల్ని కనడమనే గొప్ప సృష్టి కార్యాన్ని అదృష్టమో— దురదృష్టమో ప్రకృతి స్త్రీకే ఇచ్చింది. పెళ్ళి లేకుండా నచ్చినవాడితో సహజీవనం చేస్తారు. బాగానే వుంది! కడుపొస్తే కంటారు. ఇంకా బాగుంది!! కడుపు చేసినవాడితో స్పర్థలొస్తే విడిపోతారు. మహాబాగు!! కానీ ఆ బిడ్డ సంగతేమిటి? తండ్రి నుండి ప్రేమానురాగాల్ని పొందే ప్రాథమికహక్కుని బిడ్డ నుండి హరించెయ్యడంకాదా అది? బిడ్డ పరిపూర్ణ మానసిక వికాసానికి బిడ్డకి తల్లీ—తండ్రీ ఇరువురి ప్రేమా సమానంగా అవసరం లేదా? బిడ్డకి తండ్రెవరో బిడ్డకీ, సమాజానికి తెలపనివ్వకపోవడం గొప్ప అనుకుంటున్నారా? ఆ బిడ్డ ఎదిగాకా తన తల్లినీ, తండ్రినీ అసహ్యించుకోకుండా వుంటుందా? పురుషాధిక్య వివాహ— కుటుంబవ్యవస్థవల్ల నష్టపోతున్నామంటూ ఆ వ్యవస్థల్ని నిరాకరించి ఏ కొత్త విలువలకి పట్టంగట్టబోతున్నారు? వైవాహిక—కుటుంబ వ్యవస్థల్ని పనికిరావని త్రోసివేసే మీ దగ్గర దీనికి సమాధానాలున్నాయా? రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు— ఈ పరిస్థితికి మీరు మాత్రం కారకులుకారా? వివాహ కుటుంబవ్యవస్థల్లో దోషాలుంటే సంస్కరించుకోవాలిగానీ—చూరులో ఎలుకలున్నాయని కొంపకే నిప్పెట్టుకోవడంలాటి మూర్ఖత్వమని మీకు తోచడంలేదా?" ఆ యువకుడు తన వాదన పూర్తిచేసి ఆయాసపడిపోతూ కూర్చున్నాడు.

ఆడపిల్లలు ఎలా జవాబిచ్చి తమ వాదాన్ని సమర్థించుకునేవారోగానీ, సరిగ్గా ఆ సమయానికే కరెంట్ పోయింది.

ప్రతీ సమస్యకీ ఒక పరిష్కారం వుండితీరుతుందని భావిస్తాను. కానీ ఇవుడు వెన్నెల సమస్యని ఎలా పరిష్కరించాలో నాకు తోచడంలేదు.

ఈ సమస్యని పరిష్కరించడానికి నేనెవర్ని?


దీనికంతా నువ్వే కారణం అంటూ నారాయణ నన్ను వేలెత్తి చూపాడు కాబట్టి నేనే నెత్తినపెట్టుకుని సమస్యని పరిష్కరించాలనుకుంటున్నానా?



మిగతా 13వ పేజీలో

# మనసు వైద్యం

## అభద్రతా భావానికి మూలం కైన్ కాంప్లెక్స్



ఇద్దరు పిల్లల తండ్రిని వివాహం చేసుకున్నావన్న విచారం ఆమెలో ఇసుమంతైనా లేదు. అత్తవారింట కొత్త కోడలిగా కన్నా ఇద్దరు పిల్లల తల్లిగావే ఆమె అడుగుమోపింది. ఆమె పెద్ద మనసును పెద్దలంతా ప్రశంసించారు. భర్త ఎంతో మురిసిపోయాడు. తన బిడ్డలు అవాథలు కారని అమ్మని మరిపించే అమ్మ దొరికిందని సంతృప్తి చెందాడతను. కాలక్రమంలో ఐదు వసంతాలు గడిచిపోయాయి. ఈలోపు ఆమె మరో బిడ్డకు తల్లి అయింది. ఆమె 'సొంత' బిడ్డని చూసుకుని ముందు బిడ్డల్ని నిర్లక్ష్యం చేస్తుందేమోనవే అనుమానం అత్తవారింట్లో మొదలైంది. ప్రతి అంశాన్ని భూతద్దంలోంచి చూస్తూ ఆమెని అనుమానించటం మొదలుపెట్టారు. వాళ్ళు అనుమాన బీజాల్ని అతనిలోనూ నాటారు. అవి మొలకెత్తాయి. ఆమె ఇది భరించలేకపోయింది. మనసు విలవిలలాడింది. తన ప్రేమని, అభిమానాన్ని భర్త అనుమానించడం సహించలేకపోయింది. అదిగో అక్కడే మొదలైంది ఘర్షణ. ఆతడి పేరు మన్మథరావు, ఆమె పేరు అమ్మాజీ అనుకుందాం. మన్మథరావు ఆధునికతను సంతరించుకున్న వ్యక్తికాదు. మనస్తత్వాన్ని చదవగల మేథావి కాదు. సగటు మనిషి. ఉన్నతుడు కాకపోవచ్చు కానీ ఉత్తముడే. ఆ మాట అమ్మాజీవే ఒప్పుకుంటుంది. ఆమెతో సఖ్యతగా ఉన్నప్పుడు కొన్ని సలహాలు మన్నించాడు. పాటించాడు కూడా! పచ్చని పారాణి ఆరకముందే మాతృప్రేమను పంచి ఇస్తూ 'ఏకలవ్య'పై కూడా బిడ్డల్ని చూసుకుంటూ ఉంటే చివరికి తన ప్రేమనే శంకిస్తారా అని అమ్మాజీ ఆక్రోశం. తనెంత చూసినా అతడికి తృప్తి లేదని, చుట్టుపక్కల వాళ్ళు చెప్పిందే వింటాడు తప్ప తనని పట్టించుకోడని, తనగోడు వినిపించుకోడని అమ్మాజీ బాధ. తన కన్నకూతురికి ఏదైనా ముచ్చటపడి కొనాలన్నా ఆ పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తోందని అత్తగారు తరపువాళ్ళు, 'ఆయన' అంటాడని భయం. ఆ రకంగా తన కూతురికి ముద్దుముచ్చట తీర్చుకునే అదృష్టం కూడా లేకుండాపోతోందని ఆమె ఆక్రోశం. ఒకప్పుడు తనని ఎంతో ప్రేమగా చూసే భర్త ఇప్పుడు పట్టించుకోవడమే మానేశాడు. అతన్నే నమ్మి వచ్చిన ఆమె అతని తిరస్కారానికే గురైతే ఇక ఆమెను ఆదుకునేదెవరు? ఇదే అమ్మాజీ ప్రశ్న. నేనేం పాపం చేశానని నన్నింత నిర్లక్ష్యం చేస్తున్నాడు? కనీసం తీయని పలకరింపే కరవైపోయిందే? తనలో ఏం లోపం ఉందని? అమ్మాజీ మనోవేదనకు అంతులేకుండాపోయింది.

మన్మథరావు బాధ మరోలా ఉంది, మొదటి భార్యను మృత్యువు కబళించింది. ముక్కుపచ్చలారని పిల్లల భవిష్యత్‌ని తీర్చిదిద్దగలడా తను? తనవల్లకాదు. తండ్రిగా వాళ్ళకు తను చేయగలిగింది చేయగలడే గాని మాతృప్రేమను అందించలేడు. అమ్మను మరిపించగల మరో అమ్మ కావాలి. అందుకే అమ్మాజీని చేసుకున్నాడు. అమ్మాజీలో దేవతను చూసుకున్నాడు. తన బిడ్డలకు ఇక భయం లేదని సంతృప్తి చెందాడు. కానీ కాలక్రమంలో తన సంతృప్తి అసంతృప్తిగా మారింది. దేవత అనుకున్న ఆమె పిల్లల పాలిట దెయ్యం అయింది. పిల్లల భవిష్యత్ ఏమైపోతుందో అనే దిగులు అతనిలో నానాటికి అధికం కాసాగింది. అమ్మాజీకి ఎన్నో విధాల నచ్చచెప్పాలని చూశాడు. తన ప్రయత్నాలేమీ ఫలించలేదు. ఆమె ఎందుకలా తయారైందో తనెంత ఆలోచించినా అర్థంకావటంలేదు తనేం తప్పు చెయ్యలేదే? పెళ్ళి చేసుకునే ముందు తన సమస్య సవివరంగా చెప్పాడు. అన్నిటికీ సరే అని ఒప్పుకుంది. తీరా ఇప్పుడు ఇలా..... సగటు మనిషి మన్మథరావులో సహనం చచ్చిపోయింది. అమ్మాజీ నోరు ఎత్తితేనే అతనికి కంపరం మొదలైంది. తన పిల్లల్ని ఏం చేస్తుందో అనే భయం కూడా అతన్ని పీడించసాగింది. ఇరువురూ నా దగ్గరకు వచ్చారు వారి వారి వాదనలు, వేదనలు వినిపించారు. ఇరువురూ మానసిక పరిపక్వత ఉన్న వాళ్ళైతే అసలు వాళ్ళది సమస్యేకాదు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇటువంటి సమస్యలు అంతగా ఉండవు. మన సమాజం తీరు వేరు.

ఇద్దరి మధ్యా బయల్దేరిన సంఘర్షణ అరుపులు, కేకలతో పొరుగింటి వారి సామభూతికి, న్యాయానికి దారితియ్యటం వల్లనే అంతకంతకూ క్లిష్టమౌతోందని ఇరువురూ గ్రహించాలి. ఇద్దరూ ధర్మంగా వ్యవహరిస్తున్నామని ఎవరికివారే తీర్పు చెప్పుకుంటే సరిపోదు. ఆత్మావలోకనం చేసుకోవాలి. తమని తాము నిజాయితీగా ప్రశ్నించుకోవాలి. అలా ప్రశ్నించుకోవాల్సిన రెండు ప్రధానమైన ప్రశ్నలు ఒకటి మన్మథరావు భర్తగా భార్యకు అనురాగం పంచుతూ ఆమెతో నిజాయితీగా వ్యవహరిస్తున్నాడా? ఆమె చేసే తప్పుల్ని అలా ఉంచి ఆమె త్యాగాల్ని గుర్తించి ఆమెతో అన్యోన్యంగా ఉంటూ ఆమెను సంతోష పెడుతున్నాడా? అని. కాగా, తనెంతో త్యాగం చేశానని నవవధువుగానే బిడ్డలకు తల్లి అయ్యానని అయినా తనకు మెప్పులేదని ఆవేదన చెందే అమ్మాజీ నిజంగా తను సాకుతానని మాట ఇచ్చిన పిల్లల్ని నిజంగా తన కన్నబిడ్డల్లా చూసుకొంటోందా? మనస్సాక్షిగా వాళ్ళకు మాతృత్వాన్ని పంచి ఇస్తోందా? అని ఆత్మసాక్షిగా సమాధానం ఇచ్చుకోవాలి.

ఇరువురి వాదనలు విన్న తర్వాత వీరి మనస్తత్వాన్ని మరో విశ్లేషణ చేయగా తేలిందేమంటే భార్యమీద నమ్మకం కోల్పోయిన మన్మథరావు అభద్రతా భావానికి లోనయ్యాడు. అసలే రెండవ పెళ్ళి చేసుకున్నాననే ఫీలింగ్‌లో ఉన్న అతనిలో భార్యాభర్తల కలహాలు ఆత్మన్యూనతకు దారితీసాయి. భార్య సాధింపులు, బిడ్డలు ఏమయిపోతారో అనే భయం అతన్ని నిస్పృహకు లోనుచేసాయి. ఇన్ సెక్యూరిటీ ఫీలింగ్స్, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్, స్ట్రెస్ మన్మథరావులో లైంగికాసక్తిని కూడా క్షీణింపచేయటంతో భార్యపట్ల పూర్తి వైముఖ్యాన్ని పెంచుకున్నాడు. ఇక అమ్మాజీ విషయానికి వస్తే ఆమెలో సుపీరియారిటీ కాంప్లెక్స్‌తో పాటు కొన్ని ఫోబియాలు ఉన్నాయి. కొన్నిరకాల భావనల వలన అనంగీకృత ఆలోచనలు, వాంఛలు అంతశ్చేతనలో చెలరేగుతూ వాటిని ఎలా వ్యక్తం చేయాలో తెలియని నిస్పృహలో భర్తపై తన అసహనాన్ని ప్రదర్శిస్తూ వస్తోంది. తనే ఆ బిడ్డలకు తల్లి అయినప్పుడు తల్లిగా సంపూర్ణ ఆధిపత్యం తనదే అయినా ఆ వాస్తవాన్ని గ్రహించలేక సంతోషాన్ని వారితో పంచుకోలేక తన సంతోషానికి వాళ్ళు అవరోధంగా నిలుస్తున్నారనే భయంతో వారి వల్లనే తనస్థానం దెబ్బతింటున్నదనే అసూయతో కైన్ కాంప్లెక్స్‌కు లోనయింది. కైన్ కాంప్లెక్స్‌కు లోనయిన వారు నిరంతరం అసౌఖ్యానికి గురౌతుంటారు. కైన్ కాంప్లెక్స్ వ్యక్తుల్ని తీవ్రమైన అభద్రతకు, అసూయకు, అనుమానాలకు దారి తీయిస్తుంది. అమ్మాజీ మితిమీరిన ఆలోచనల్ని ముందు మానుకోవాలి. మన ఆలోచనలు మన దృక్పథాన్నిబట్టే ఇతరుల్ని అంచనా వేస్తామని కనుక ఇతరుల దృక్పథం ఇలా ఉంది అని నిర్ణయానికి వచ్చేముందు మన దృక్పథం అలా ఉందా? అని ప్రశ్నించుకోవాలి. 'సెల్ఫ్ జస్టిఫికేషన్' మానుకోవాలి. ఎదుటివారిని మోసంచేసే వ్యక్తులుకూడా ఇతరులంతా తనని మోసం చేశారని అందుకే తను ఇలా మారానని సమాధానపడతాడు. అన్నీ తెలుసుననుకునే అమ్మాజీ తన అమాయకత్వాన్ని, ఆలోచనల్ని కట్టిపెట్టి నిజమైన అమ్మాజీగా పిల్లలకు మాతృత్వ మధురిమను అందించాలి. ఇతరుల మాటలు వినిపించుకోకుండా తన జీవిత భాగస్వామినిగా వచ్చిన భార్యకు ప్రేమానురాగాల్ని పంచాలి మన్మథరావు. అలా అయ్యేందుకు వాళ్ళిద్దరికీ హిప్నోథెరపీలో కౌన్సిలింగ్‌తో పాటు బిహేవియరల్ థెరపీ ఇవ్వటం జరిగింది. పరస్పర అవగాహనతో పసిడి మొగ్గల్లాంటి పిల్లల్ని వికసింపచేసి ఆ పసిడి కాంతులతో తామూ వెలిగిపోతారో, పసిడి మొగ్గలపై భీషణ, దూషణ, తిరస్కారాల అగ్గిపిడుగులు కురిపించి ఆ సెగలు, సెగల మధ్య తాము మాడిపోతారో ఇక వాళ్ళ ఇష్టం.

—డాక్టర్ వి.నగేష్
హిప్నాటిస్ట్
208, సెకండ్ ఫ్లోర్
కిరణ్ సెంటర్, ఎస్.డి.రోడ్,
సికిందరాబాద్-500 003

# పాలివ్వని తల్లులకు రొమ్ము కాన్సర్

నయాపూల్ లోని జిజిఖాన్, గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్‌లో ప్రొఫెసర్‌గా, సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డా. బాలాంబగారితో ఇంటర్వ్యూ. తన ముప్ఫై సంవత్సరాల అపార అనుభవంతో ఆమె ఎందరో సర్విక్స్ కేన్సర్–బ్రెస్ట్ కేన్సర్ రోగులకు చికిత్స చేశారు.

ప్ర: బ్రెస్ట్ కేన్సర్ ఎవరిలో ఎక్కువగా వస్తుంది? రావడానికి కల ప్రత్యేక కారణాలను వివరిస్తారా?

జ: ఇదెలా మొదలవుతుందంటే... బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను పట్టించడం మానేసి సీసా ఫీడింగ్ అలవాటుచేస్తారు. ఎందుకంటే ముర్రుపాలపై వున్న దురభిప్రాయం ఒకటి... ఇంకొకటి.. బిడ్డకవి సరిపోవని. తర్వాత అదే కొనసాగిస్తారు. తర్వాత కొంతమందికి పాలు తాగించేప్పుడు నొప్పి వుండడం మూలాన మానేస్తారు. తర్వాత కారణం రొమ్ముల అందం చెడుతుందని పట్టకుండా వుండిపోతారు. ఇదే కాకుండా పిల్లకి పాలు సరిపోవడం లేదని కూడా సీసా పాలు అలవాటుచేస్తారు. దీని మూలాన ఏమవుతుందంటే... బ్రెస్ట్‌లో గ్లాండ్స్ సరిగా పనిచేయకపోవడం జరుగుతుంది. అది క్రమంగా కేన్సర్‌కి దారితీసే అవకాశం వుంది. కాబట్టి పిల్లలకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలి. దీనికిపుడు పాశ్చాత్య దేశాలతోపాటు మన దేశంలో కూడా బేబీ ఫ్రెండ్లీ హాస్పిటల్.. కేవలం బ్రెస్ట్ ఫీడింగ్ కోసం నడిపిస్తున్నారు. దీంతో పాటు బాలింతలు మంచి పౌష్టికాహారం.. అధికంగా నీరు తీసుకోవాలి. దీంతో పాల ఉత్పత్తి పెరిగి రొమ్ములోని గ్రంధులు సక్రమంగా పనిచేస్తాయి. గ్రామాలలో బాలింతలకు నీరు ఎక్కువ పట్టరు. దాంతో యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్‌కి గురవడమే కాకుండా పాల ఉత్పత్తీ తగ్గుతుంది.

ప్ర: డాక్టర్‌గారూ.. బ్రెస్ట్ కేన్సర్ రాకుండా ఎలా నిరోధించాలి?

జ: పౌష్టికాహారం తీసుకోవాలి. పాలసీసాలతో పాలు పట్టడం మానేయాలి. తల్లి పాలను తాగించాలి. హార్మోన్ వాడడం తగ్గించాలి. పీరియడ్ పోస్ట్‌పోన్‌మెంటుకు హార్మోన్స్ వాడడం మానెయ్యాలి.

ప్ర: డాక్టరుగారూ.. బ్రెస్ట్ కాన్సర్‌కి చికిత్స ఎలా వుంటుంది?

జ: సెల్ఫ్ ఎగ్జామినేషన్‌లో కణుతులేమైనా వుంటే వెంటనే డాక్టర్ని సంప్రతించాలి. కణితి ప్రాథమిక దశలో వుంటే సింపుల్ మాస్టెక్టమీ.. సెకండరీస్‌లో వుంటే.. రాడికల్ మాస్టెక్టమీ రేడియేషన్, కీమోథెరపీ ఇస్తాము. ప్రాథమిక దశలో చికిత్స వలన పేషెంట్ ఆయువుని ఇంకో పదిమంచి పదిహేను సంవత్సరాలు పొడిగించవచ్చు.

ప్ర: డాక్టరుగారూ.. సర్విక్స్ కేన్సర్ గురించి చెబుతారా?



ప్రక్క కండరాల నుంచి పైకి వృద్ధి చెందుతున్న రొమ్ము కాన్సర్

జ: జననాంగాల అపరిశుభ్రత, సంపర్కం తర్వాత జననాంగాలను శుభ్రం చేసుకోకపోవడం, ఇన్‌ఫెక్షన్ వచ్చినా సిగ్గుతోనో మరింకే కారణాలతోనో చూపించుకోకపోవడం.. పాసివ్ స్మోకింగ్‌కు ఎక్స్‌పోజ్ కావడం ఇలా చాలా కారణాలున్నాయి. సిగరెట్ స్మోకర్స్‌లో స్మెగ్మాలో నికోటిన్ చేరి.. సంపర్కం ద్వారా స్త్రీలలో సర్విక్స్ కేన్సర్‌ను కలిగిస్తుంది. చిన్న వయసులో ప్రసవం అవడం మూలాన గర్భాశయ ముఖద్వారపు కణజాలం దెబ్బతిని.. ఇన్‌ఫెక్షన్‌కు గురై.. సర్విక్స్ కేన్సర్ వచ్చే అవకాశం వుంది. మళ్ళీ, మళ్ళీ గర్భం ధరించడం వలన గర్భాశయ ముఖద్వారం దెబ్బతిని త్వరగా ఇన్‌ఫెక్షన్స్‌కు గురవడం కూడా ఒక కారణం.

ప్ర: డాక్టర్‌గారూ.. పాశ్చాత్య దేశాలలో సర్విక్స్ కేన్సర్ ఎందుకు తక్కువగా వుందో చెబుతారా?

జ: అక్కడ వ్యక్తిగత శుభ్రతతోపాటు స్క్రీనింగ్‌కు అవకాశం ఎక్కువ. మనకు ఇక్కడ అందరికీ అది అందుబాటులో లేదు. అయితే ఆపర్చునిటీ స్క్రీనింగ్ చేయడం జరుగుతుంది. ఎలా అంటే... ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ అవుడు సర్విక్స్ పాప్‌స్మియర్ తీసి టెస్ట్‌కు పంపడం జరుగుతుంది. ఇది ప్రభుత్వం ఏర్పరచిన 'రిప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ ప్రాజెక్ట్'లో 'టార్గెట్ ఫ్రీ ఎప్రోచ్' పద్ధతిన జరుగుతుంది.

ప్ర: డాక్టరుగారూ.. యుటిరస్ ఎండోమెట్రియమ్ కేన్సర్ ఏయే వయసులవారిలో ఎక్కువ? ఎవరిలో ఎక్కువ?

జ: 55 నుంచి 60 సం.ల మధ్య తర్వాత వస్తుంది. మెనోపాస్ అయిన తర్వాత వస్తుంది. అధికంగా లావుగా వున్నవారిలో– బిపి, డయాబెటిస్ వున్నవారిలో ఎక్కువగా వచ్చే అవకాశం వుంది. అలాగే మెనోపాసల్ సిండ్రోమ్లో లేక ఆస్టియో పోరోసిస్ వ్యాధిలో ఈస్ట్రోజన్స్ అధికంగా ఇచ్చిన వారిలో వస్తుంది. 12-28 శాతం వంశానుగతంగా వచ్చే అవకాశం వుంది.

ప్ర: ఎండోమెట్రియల్ కేన్సర్ లక్షణాలు ఎలా వుంటాయి?

జ: మెనోపాస్ అయినతరువాత రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి.

ప్ర: చికిత్స ఏమిటి?

జ: అధిక మోతాదులో ఒక గ్రామ్ లేక ఎక్కువ ప్రొజెస్టిరాన్ ఇవ్వడం.

ప్ర: అండాశయ కేన్సర్ గురించి చెబుతారా?

జ: ఇది ఏ వయసులోనైనా రావచ్చును. అయితే దీన్ని గుర్తించడం కష్టం. మూడవ స్టేజి వచ్చేదాకా లక్షణాలు బయటపడవు. ఆకలి మందగించి, నీరు చేరడం– స్కానింగ్‌లో అండాశయం వాచి పెద్దగా కనిపిస్తుంది. రక్తస్రావం జరగడం– పోస్ట్ మెనోపాసల్ స్టేజిలో రక్తస్రావం.. శస్త్రచికిత్సలో ఈ ఓవేరియన్ ట్యూమర్స్ తొలగించవచ్చును.

ప్ర: డాక్టరుగారూ.. మన దేశంలో స్త్రీల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని చికిత్సా ప్రమాణాలను నిర్ధారించడం జరగడం లేదు. స్త్రీల ఆరోగ్యం అంటే.. ఇటు కుటుంబంలో, అటు ప్రభుత్వమూ చాలా చిన్నచూపు చూడడం జరుగుతుంది. ఉదాహరణకు సర్విక్స్ కేన్సర్ రాకుండా ముందుగానే నిరోధించే ఆరోగ్య సూత్రాలను గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేయడానికి బదులు కేవలం స్త్రీల ఆరోగ్య సమస్యలను గర్భధారణకు, అబార్షన్‌కు, మాలాడీలు– కాపర్ టీలు, ట్యూబెక్టమీలకే కుదించి ప్రణాళికలు సిద్ధం చేయడం, అమలుచేయ్యడం ద్వారా అసలు సమస్యలను నిర్లక్ష్యం చేయడం దారుణం కాదా?

జ: అదేం లేదు. ఆపర్చునిటీ స్క్రీనింగ్‌లో ట్యూబెక్టమీలకు వచ్చిన స్త్రీలను పాలుపంచుకునేలా చేస్తోందిపుడు ప్రభుత్వం. దాంతోపాటు మీరు చెప్పినట్టు ప్రివెంటివ్ హెల్త్ మెజర్స్ పాటించడంతో కూడా చాలామటుకు నివారణ సాధ్యం!

ప్ర: డాక్టరుగారూ... స్త్రీలలో సర్విక్స్ కేన్సర్‌ను నిరోధించడానికి పురుషులు ఏ రకంగా జాగ్రత్తలు తీసుకోవాలి? వాళ్ళ బాధ్యత ఏమిటి?

జ: చాలా మంచి ప్రశ్న వేశారు.. 1. స్మోకింగ్ మానెయ్యాలి. 2. వాళ్ళు కూడా వ్యక్తిగత శుభ్రత (పర్సనల్ హైజీన్) పాటించాలి.
3. సర్‌కమ్‌సెషన్ (సున్తీ) చేయించుకుంటే చాలా మంచిది.
4. స్త్రీల ఆరోగ్యం గురించి శ్రద్ధ, జాగ్రత్త వహిస్తూ.. వారిని వైద్యుల వద్దకు సకాలంలో తీసుకెళ్లడం.
5. వేశ్యలతో సంపర్కం మానెయ్యడం.
6. కండోమ్స్ వాడడం చాలా ముఖ్యం.

—డాక్టర్ భారతి

వచ్చేవారం
పొంచివున్న సర్విక్స్‌కాన్సర్ మహమ్మారి

## వెన్నెల కథ..

(పన్నెండవ పేజీ తరువాయి)

అసలు యీ సమస్య నాదా-నారాయణదా-వెన్నెలదా?
ఆ పిల్ల తన సమస్యను పరిష్కరించమని నన్ను కోరలేదే!
వెన్నెలకిది అసలు సమస్యే కాదేమో! వెన్నెల కోరుకునే స్వేచ్ఛా జీవిత విధానమేమో యిది!
వెన్నెలని ప్రశ్నించడానికి నాకేం హక్కుంది?
తను చేస్తున్న ప్రయోగం తాలూకు ఫలితాలు ఎలా వుంటాయో విద్యాధికురాలు, సామాజిక



విలువల పరిశోధకురాలూ, స్త్రీవాద రచయిత్రీ అయిన వెన్నెలకి తెలీదా? అలా అని యీ విషయంలో నాకేం సంబంధం లేనట్టు నేను తప్పుకోవడం సమంజసమేనా?
అంత చలిలోనూ నా బుర్ర వేడెక్కసాగింది.
ఎంతసేపలా వున్నానో అడుగుల చప్పుడుకి వెనుదిరిగి చూశాను.
మాలతి దగ్గరకొచ్చింది. మాలతి వెన్నెలతో ఏం మాట్లాడి వుంటుంది? నేనడగలేదు.
మాలతీ చెప్పలేదు.
నాకు చలిగాలి తగులుతోందని కాబోలు మాలతి పైట తీసినా చుట్టూ కప్పి నా భుజంపై తలవాల్చింది. కొద్ది క్షణాల్లో తెల్లారబోతున్నట్టు పరిసరాలు తెల్లనిముసుగుని తొలగించుకుంటున్నాయి.
వెన్నెల అవ్యక్తంగా అనిర్వచనీయంగా వుంది.–

వచ్చేవారం కథ
**శ్రీకారం**
– అంబల్ల జనార్ధన్